



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా. పక్కన డిఇఒ శామ్యూల్ పాల్

అరకొరే..!

- రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు కేటాయింపులు అంతంత మాత్రమే
- ప్రస్తావన లేని ఉర్దూ యూనివర్సిటీ, ఆదోని వైద్య కళాశాల

రాష్ట్ర బడ్జెట్‌ను శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. అందులో ఉమ్మడి కర్నూలు జిల్లాకు కేటాయింపులు అరకొరగానే ఉన్నాయి. ఉర్దూ యూనివర్సిటీ, ఆదోని వైద్య కళాశాల ప్రస్తావన అసలే లేదు. ఈ బడ్జెట్‌పై పలు పార్టీల నాయకులు పెదవి విరుస్తున్నారు..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కార్పొరేషన్

2025-26 సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. మొత్తం బడ్జెట్ రూ.3 లక్షల 22 వేల 359 కోట్లతో వార్షిక బడ్జెట్‌ను ప్రతిపాదించారు. మూలధనం అంచనా వ్యయం రూ.40,635 కోట్లుగా, ద్రవ్యలోటు రూ.79,926 కోట్లుగా అంచనా వేశారు. ఏపీ బడ్జెట్‌లో సూపర్ సిక్స్ హామీల్లో రెండు అమలు దిశగా ప్రతిపాదన చేసారు. తల్లికి వందనం పథకం అమలు కోసం ఈ ఏడాది రూ.9,407 కోట్లు కేటాయించారు. అన్నదాత సుఖీభవ పథకం కోసం రూ.6,300 కోట్లు కేటాయించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం గురించి ఈ సారి బడ్జెట్‌లో ప్రస్తావన చేయలేదు. ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇచ్చే మహిళా శక్తి, నిరుద్యోగ భృతి గురించిన ప్రస్తావన బడ్జెట్‌లో లేదు.

ఉమ్మడి జిల్లాకు రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు అన్యాయం జరిగింది. కొత్త ప్రాజెక్టుల ఊసే లేదు. కర్నూలు జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీలిస్తున్నా బడ్జెట్‌లో మాత్రం కేటాయింపులు చేయలేదు. గుండ్రేవుల, వేదవతి, ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణాలకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. కేటాయింపుల్లో ప్రధానంగా జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.446.34 కోట్లు కేటాయించారు. అందులో కెసి కెనాల్‌కు రూ.10.24 కోట్లు, ఎస్ఆర్‌బిసి కోసం రూ.9.02 కోట్లు, గురు రాఘవేంద్ర ప్రాజెక్టుకు రూ.34.06 కోట్లు కేటాయించారు. 68 చెరువులు నింపే పథకానికి రూ.37 కోట్లను కేటాయించారు. గాజులదిన్నె ప్రాజెక్టుకు రూ.11.97 కోట్లు, శ్రీశైలం విద్యుత్ ఉత్పత్తి కోసం రూ.3.65 కోట్లు కేటాయించారు. కర్నూలు చీఫ్ ఇంజనీర్ పరిధిలో చేపట్టబోయే కొత్త ప్రాజెక్టులకు రూ.103.27 కోట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. క్లస్టర్ యూనివర్సిటీకి రూ.1.20 కోట్లు, రాయలసీమ యూనివర్సిటీకి రూ.11.28 కోట్లు, తుంగభద్ర పుష్కరాల పనుల రోడ్లకు రూ.5 కోట్లు కేటాయించారు. నంద్యాలతో పాటు రాష్ట్రంలోని మరో రెండు వైద్య కళాశాలలకు కలిపి రూ.245 కోట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. కర్నూలులో సామాజిక వ్యతిరేక, ప్రమాదకర కార్యకలాపాల నియంత్రణ మండలి ఏర్పాటుకు రూ.31 లక్షలు కేటాయించారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఉర్దూ యూనివర్సిటీ ప్రస్తావన లేకుండా పోయింది. ఇప్పటికే ఆపేసిన ఆదోని వైద్య కళాశాల నిర్మాణ పనుల కోసం కేటాయింపులేవీ చేయలేదు. దీంతో ఆదోని వైద్య కళాశాల నిర్మాణం ఆగిపోనుంది. రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు అరకొర కేటాయింపులు కేటాయించడంపై జిల్లా వాసుల నుంచి తీవ్ర అసహనం వ్యక్తం అవుతోంది.



ఎన్నికల హామీలను విస్మరించిన బడ్జెట్

- డి.గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి.



రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించింది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవకు అరకొర నిధులు కేటాయించడం తప్ప ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం కోసం ఎటువంటి ప్రతిపాదనలు లేకపోవడం రాష్ట్ర ప్రజలను నమ్మించి మోసం చేయడమే. సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.11,314 కోట్లు కేటాయించడం అంటేనే వ్యవసాయం పట్ల ఈ ప్రభుత్వానికి ఎలాంటి చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతుంది. బడ్జెట్లో రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టుల గురించి గానీ, జిల్లాలో పెండింగ్ ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు గురించి గానీ ఎక్కడా ప్రస్తావన లేకపోవడం గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని తుంగలో తొక్కడమే. వలసల నివారణ కోసం ఎటువంటి ప్రతిపాదనలు లేకపోవడం బాధాకరం. నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు, విద్యుత్ ఛార్జీల తగ్గింపు గురించి ఎటువంటి ప్రస్తావన లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. అమరావతి బానకచర్ల ప్రాజెక్టు గురించి ప్రస్తావించడం అది రాయలసీమ ప్రజలను మోసం చేయడమే. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ గురించి బడ్జెట్ ప్రసంగంలో మాట మాత్రం కూడా చెప్పకపోవడం చదువుకున్న యువతీ యువకులను మోసం చేయడమే. ఐటి రంగం అదిగో వస్తుంది ఇదిగో వస్తుంది దానివల్ల ఉపాధి కలుగుతుందని మభ్యపెట్టే ప్రయత్నం చేశారు.

కేవలం నిర్వహణ వ్యయం చూపారు

- ఆచార్య ఎస్.మున్నూర్ రహమాన్, మానవశక్తి పరిశోధన కేంద్రం, కర్నూలు.



బడ్జెట్ వ్యవసాయ బడ్జెట్, డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం, రైతులు, మత్స్యకారులు, వ్యవసాయ అనుబంధ రంగాలకు, జలవనరుల అభివృద్ధికి జరిగిన కేటాయింపులు సత్ఫలితాలను ఇస్తాయి. పాఠశాలకు ఉచిత విద్యుత్తు, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, నైపుణ్యాభివృద్ధికి చేసిన ప్రతిపాదనలు చెప్పుకోదగ్గవి. రాష్ట్ర అభివృద్ధికి కీలకంగా ఉన్న సేవారంగానికి ప్రోత్సాహకరంగా వనరుల కేటాయింపు జరగలేదు. కర్నూలు జిల్లా పెండింగ్‌లో ఉన్న నీటి ప్రోజెక్టుల గురించిన ప్రస్తావన లేదు, కేవలం నిర్వహణ వ్యయం చూపారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధికి కేటాయింపులు నామమాత్రం.

ఇది జన రంజక బడ్జెట్

- పాలకుర్తి తిక్కారెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు



టిడిపి ప్రవేశపెట్టిన 2025 -26 వార్షిక బడ్జెట్ జన రంజకంగా ఉంది. అన్ని వర్గాల ప్రజలు ఆమోదించిన బడ్జెట్ ఇది. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల అవసరాలను తీర్చే దిశగా బడ్జెట్‌ను రూపొందించారు. రాష్ట్రం కష్ట కాలంలో ఉన్నప్పటికీ ఏమాత్రం వెనుకాడకుండా ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో బడ్జెట్ ప్రణాళికలు రచించారు. ఆహ్వానించదగిన బడ్జెట్ ఇది.

జిల్లాకు తీరని అన్యాయం

- బి.గిడ్డయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి.



కర్నూలు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, గుండ్రేవుల రిజర్వాయర్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడం జిల్లా ప్రజలకు బాధ కలిగించింది. ఆ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేస్తామని ఓట్లు వేయించుకున్నారు. అయినప్పటికీ బడ్జెట్లో కేటాయింపులు చేయకపోవడం సమంజసం కాదు. సాగునీరు, తాగునీరు, ఉపాధి లేక వలసలతో అల్లాడుతున్న ఉమ్మడి జిల్లాకు బడ్జెట్‌లో తీరని అన్యాయం జరిగింది. బడ్జెట్‌కు సవరణలు చేసి వేదవతి, ఆర్డీఎస్ కుడికాలువ, గుండ్రేవుల ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలి.

కేంద్రాల్లో సౌకర్యాల కల్పన...

- పదోతరగతి పరీక్షల అవగాహనలో కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఈనెల 17 నుండి 31 వరకు నిర్వహించనున్న పదవ తరగతి పరీక్షలలో ఎలాంటి పొరపాట్లు జరగకూడదని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో తప్పనిసరిగా తాగునీరు లైటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో పదవ తరగతి పరీక్షల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యాత్మకంగా గుర్తించిన పరీక్ష కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేంద్రాల్లో సజావుగా పరీక్షలు జరిగేలా పోలీసులు, తహసీల్దార్ల సహకారం తీసుకోవాలని సూచించారు. 39 పోలీస్ స్టేషన్లను స్టోరేజ్ పాయింట్లుగా గుర్తించామన్నారు. జిరాక్స్ షాప్ సెంటర్లు పరీక్ష కేంద్రాల వద్ద లేకుండా కార్మిక శాఖ అధికారికి ఆదేశాలు జారీ చేశామన్నారు. మొబైల్ ఫోన్లను, ఎలక్ట్రానిక్ వాచ్‌లను పరీక్ష కేంద్రాల లోపలికి తీసుకొని రాకుండా చీఫ్ సూపరింటెండెంట్లు చూసుకోవాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం దగ్గర 144 సెక్షన్ అమలు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. డిఇఒ శామ్యూల్ పాల్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణ్ పాల్గొన్నారు.

కల్లూరు ఇండస్ట్రీయల్ ఎస్టేట్ అభివృద్ధికి చర్యలు
- రూ.1.69 కోట్ల ప్రోత్సాహకాలకు ఆమోదం

కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ అభివృద్ధికి ప్రతిపాదనలు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్‌ఫర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాల్లో భాగంగా 17 క్లెయిమ్‌లకు రూ.1.69 కోట్లకు ఆమోదం తెలపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టమోటా, ఉల్లి, మిర్చి, మిల్లెట్స్‌కు సంబంధించి ప్రాసెసింగ్ యూనిట్లు, ఇతర పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలను గుర్తించి పరిశ్రమలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పత్తికొండలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుపై కలెక్టర్ ఆరా తీశారు. త్వరలో భూమిపూజ చేయనున్నట్లు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ అధికారి కలెక్టర్‌కు వివరించారు. ఓర్వకల్లుమెగా ఇండస్ట్రియల్ హబ్‌లో ఎక్స్‌టర్నల్, ఇంటర్నల్ రోడ్ల నిర్మాణపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎపిఐఐసి జోనల్ మేనేజర్ ఆదేశించారు. నీటి సరఫరా పైపు లైన్ నిర్మాణపు పనులు 68 శాతం అయ్యాయని, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ కింద దరఖాస్తులు పెండింగ్ లేకుండా త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ ఇన్చార్జి జిఎం అరుణ పాల్గొన్నారు.

నేర నియంత్రణకు చర్యలు

- నేర సమీక్షలో ఎస్‌పి విక్రాంత్ పాటిల్
స్టేషన్లను ఆశ్రయించే బాధితుల పట్ల మర్యాదగా ఉండాలి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

నేర నియంత్రణకు ప్రతి ఒక్కరూ గట్టిగా పని చేయాలని, పెండింగ్ కేసులు తగ్గించాలని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వ్యాస్ ఆడిటోరియంలో డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలతో జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్‌పి పోలీసు అధికారులతో మాట్లాడారు. కర్నూలు , పత్తికొండ , ఆదోని , ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లో దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. పోలీసుస్టేషన్ల వారీగా కేసుల పెండింగ్ కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పలు సలహాలు, సూచనలు చేశారు. కేసుల వివరాలను సిసిటిఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. గ్రీవెన్స్ కేసులు, యుఐ కేసులు, మర్డర్, రోడ్డు ప్రమాదాలు, ఫోక్సో కేసులు, మిస్సింగ్ కేసులు, ఎస్సీ ఎస్టీ కేసులు, డ్రంకెన్ డ్రైవ్ కేసులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఏదైనా విషయంపై పోలీసు అధికారులను వివరాలను అడిగినప్పుడు సరైన సమాచారం ఇవ్వాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలతో పాటు పోలీసు సిబ్బంది కూడా ప్రతి ఒక్కరూ బైక్ నడిపేటప్పుడు లైసెన్సులు, హెల్మెట్ లు కలిగి ఉండాలన్నారు. డ్రంకెన్‌డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ ఆయా పోలీసుస్టేషన్ల పరిధులలో తనిఖీలు నిర్వహించాలన్నారు. సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఎప్పటికప్పుడూ పెండింగ్ కేసుల వివరాలను టెలి కాన్ఫరెన్స్‌లో అడిగి తెలుసుకుంటామన్నారు. పోలీస్ స్టేషన్లను ఆశ్రయించే బాధితుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. సమీక్షలో అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ జి.హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి కృష్ణ మోహన్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డిఎస్‌పిలు జె.బాబు ప్రసాద్, కె.శ్రీనివాసాచారి, హేమలత, భాస్కర్‌రావు, ట్రైనీ డిఎస్‌పి ఉషశ్రీ, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

హమాలీల సమస్యలు పట్టని ప్రభుత్వం

- సివిల్‌సప్లయ్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సివిల్‌సప్లయ్ హమాలీల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ కృష్ణ విమర్శించారు. ఇప్పటికైనా మొండి వైఖరి వీడాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సివిల్‌సప్లయ్ ఎంఎల్ ఎస్ పాయింటు దగ్గర పి.సోల్మాన్ రాజు అధ్యక్షతన ధర్నా చేశారు. ఆర్.కృష్ణ, సిఐటియు నగర ఆటో నగర కార్యదర్శి పి.మైమూద్ మాట్లాడారు. హమాలీల కూలిరేట్లకు సంబంధించిన పెంచిన కొత్త కూలిరేట్లకు సంబంధించిన జిఒను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అగ్రిమెంట్ ముగిసిపోయి 14 నెలలు అవుతున్నా వారికి పెరిగిన ధరలకనుగుణంగా జిఒను విడుదల చేయకుండా కలయాపన చేస్తుందని విమర్శించారు. రెండేళ్లకోసారి అగ్రిమెంటు ప్రకారం పెరిగిన నామినల్ రేట్లు పెంచుతున్నారన్నారు. ప్రస్తుత రేట్ల ప్రకారం రూ.30 నుండి రూ.40 వరకు పెంచి ఇస్తే తప్ప వారి జీవనం ముందుకు సాగదన్నారు. సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందుతుందన్నారు. పెంచిన కూలి రేట్లు రూ 25 నుండి రూ.28 సంబంధించిన జీవోను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హమాలీల సమస్యలను పరిష్కరించకపోతే అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి బజారి ,సోల్మాన్ రాజు ,ఆర్ చంద్ర,కర్నూల్ ఎంఎల్ఎస్ పాయింట్ యూనియన్ సెక్రటరీ సోలమన్ రాజు, శివ, వినయ్, ప్రకాష్, రమేష్, శ్రీను, ఎం.రాజు, వెంకటేష్ , బాలరాజు, మహేంద్ర, డి.సూరి ,మద్దిలేటి ,సుధాకర్, బి.దేవరాజు నాయకులు పాల్గొన్నారు.


ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి నవీన్‌పాటిల్

ప్రభుత్వ విద్యా రంగానికి 20శాతం నిధులివ్వాలి

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

ప్రభుత్వ విద్యా రంగం అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్లో 20 శాతం నిధులు కేటాయించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నవీన్ పాటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోడుమూరు యుటిఎఫ్ కార్యాలయంలో యుటిఎఫ్ మండల కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ నాడు-నేడు ఫేస్ 2 కింద పూర్తి చేయని తరగతగదులు అనేకం ఉన్నాయన్నారు. వాటి గురించి బడ్జెట్లో ఎక్కడ ప్రస్తావన లేదని, బడ్జెట్లో 12వ పిఆర్‌సి ఆర్థిక బకాయిల చెల్లింపు ఊసే ఎక్కడ లేదన్నారు. 2023 జులై నుండి 12వ పిఆర్‌సి ఛైర్మన్ నియమించకపోవడం, పిఆర్‌సి అమలు అయ్యేలోపు ఐఆర్ ఇచ్చేందుకు నిధులు కేటాయించకపోవడం దారుణమని తెలిపారు. 12వ పిఆర్‌సి కోసం, ఆర్థిక బకాయిల కోసం నిధులు కేటాయింపు విద్యారంగం బలోపేతానికి బడ్జెట్లో 20 శాతం నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి మార్కు, మధుశేఖర్, జిల్లా నాయకులు అలీఖాన్, వెంకటేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సాయి సుబ్బయ్య రవీంద్రలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



కర్నూలు నగరంలో మాధవి నగర్ నందలి రవీంద్ర ఇంగ్లీషు మీడియం స్కూలు, రెవెన్యూ కాలనీలో రవీంద్ర టాలెంట్ స్కూల్స్‌లో కరస్పాండెంట్ పిబివి.సుబ్బయ్య ఆధ్వర్యంలో సివి. రామన్ జన్మ దినాన్ని పురస్కరించుకుని జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పిబివి మాట్లాడుతూ సైన్సే నా మతం జీవితాంతం దానినే ఆరాధిస్తానని చెప్పిన విజ్ఞాన ఘని సర్ సివి.రామన్ సైన్సులో ఎవరూ చేయలేని సాహసాలను, క్లిష్ట సమస్యలను అత్యంత సునాయాసంగా ఛేదించి ప్రపంచ వినువీధిలో భారత కీర్తి పతాకాన్ని రెపరెపలాడించిన ధృవతార సర్ చంద్రశేఖర్ వెంకటరామన్ అన్నారు. వైజ్ఞానిక రంగంలో ప్రపంచ దేశాలను తలదన్నేలా భారత్ను శక్తివంతంగా చూపి, అబ్బురపరిచే ప్రయోగాలకు నిలువెత్తు వేదికలా నిలిచారన్నారు. సర్ సివిరామన్. వైజ్ఞానిక రంగంలో ఆసియా ఖండంలోనే తొలి నోబెల్ అందుకున్న కాంతి పుంజం అని కొనియాడారు. ఈ సదస్సుకు ముఖ్య అతిధిగా హారిజాన్స్ ప్లే స్కూల్ ఛైర్మన్ పి.ప్రదీప్ కుమార్ హాజరై విద్యార్థుల ప్రతిభను, సృజనాత్మకతను మెచ్చుకొని అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

సివి రామన్ జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అనేక విద్యాలయాల్లో ఘనంగా సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. సివి రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యాలయాల్లో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్లో విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో అనేక అంశాలపై అవగాహన కల్పించేలా ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేశారు

క్లస్టర్ వర్సిటీ పరిధిలో : క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వివి సుబ్రహ్మణ్య కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విసి డివిఆర్ సాయి గోపాల్ , ట్రిబుల్ ఐటీ డిఎంకంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కొర్ర సత్యబాబు లు ఎగ్జిబిషన్ స్టాళ్లను పరిశీలించారు. మాట్లాడుతూ ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు తప్పనిసరిగా తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులకు బహుమతులను వారు ప్రదానం చేశారు. ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం ఇందిరా శాంతి. ట్రిపుల్ ఐటి ప్రొఫెసర్ కృష్ణ నాయక్ యూనివర్సిటీ డీన్ నాగరాజ్ శెట్టి, వైస్ ప్రిన్సిపల్ దేవికా రాణి, వాజిద్, పద్మావతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సైన్స్ దినోత్సవంలో మాట్లాడుతున్న విసి సాయిగోపాల్

ఉస్మానియా కళాశాలలో: ఉస్మానియా కళాశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సమీయుద్దీన్ ముజమ్మిల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఏ ఎం.గజిని రామన్ సాధించిన విజయాలను వివరించారు. భౌతిక శాస్త్ర ఉపన్యాసకులు డాక్టర్ షేక్ అబ్దుల్ ,యూనివర్సిటీల నియంత్రణ అధికారి ఆరిఫాన్, అబీదలి, స్వాములు, షేక్ తాజుద్దీన్, రియాజ్ ఖాన్ లు పాల్గొన్నారు.

రవీంద్ర విద్యాసంస్థల్లో సైన్స్ ఎక్స్‌పో : కర్నూల్ నగరంలోని స్థానిక అబ్బాస్ నగర్ లోని రవీంద్ర విద్యాసంస్థలలో సి.వి.రామన్ జన్మదినాన్ని పురస్కరించుకొని సైన్స్ ఎక్స్‌పోనిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సృజనాత్మకత అంవాలపై ఈ సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ మమతా మోహన్ మాట్లాడారు. మనిషి జీవితానికి సైన్స్ ఎంతో ముడిపడి ఉందన్నారు. ప్రతి అంశాన్ని పరిశీలన, పరిశోధనతో క్షుణ్ణంగా అధ్యయనం చేసి చదివి ఉత్తములుగా ఎదగాలన్నారు.

రవీంద్రవిద్యార్థులకు ప్రథమ బహుమతి :

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కర్నూల్ లోని ట్రిబుల్ ఐటీ డిఎం లో నిర్వహించిన నేషనల్ సైన్స్ డే 2025 పోటీలలో రవీంద్ర బాలికల పాఠశాల విద్యార్థినులు డ్యూయల్ పర్పస్ వీల్ చైర్ , స్ట్రెచర్ బెడ్ ఫర్ హాస్పిటల్ అంశానికి ప్రథమ బహుమతి పొందారు. పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థినులు యస్. అఫీఫా ఫిర్దోస్, జిఎస్.లిఖిత, పి. సమీరాభాను లను, అందుకు సూచనలు అందించిన ఎటిఎల్ మాస్టర్ రమేష్,రంజిత్ కు రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపకులు జి. పుల్లయ్య ,ఛైర్మన్ జివిఎం మోహన్ కుమార్ , అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ మమతా మోహన్ వైస్ ఛైర్మన్ జి. వంశీధర్ అభినందించారు.సి ఆర్ ఆర్ ఎం పాఠశాలలోకర్నూల్ నగరంలోని కట్టమంచి రామలింగారెడ్డి స్మారక మున్సిపల్ పాఠశాలలో సైన్స్ డే నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి వెంకటరెడ్డి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. సైన్స్ ఎగ్జిబిషన్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంస పత్రాలను అందజేశారు

వృత్తికి అంకితమైన కల్పన

-విద్యార్థుల కల్పతరువు -సేవలో తనకు తానే సాటి -ఎంత ఎదిగినా ఒదిగే మనస్తత్వం
-విశ్రాంత కాదు విజయ దీప్తి -ఉద్యోగ విరమణ సన్మాన సభలో వక్తలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఉపాధ్యాయురాలుగా మాత్రమే కాకుండా మాతృమూర్తిగా, తోబుట్టువుగా స్నేహితురాలిగా సేవలందించే కల్పతరువు క్రిష్ణగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.కల్పన అని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం ఆమె ఉద్యోగ విరమణ అభినందన సభను క్రిష్ణగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అత్యంత ఘనంగా తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామ పెద్దలు నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కల్పనను ఆమె భర్త ధనుంజయను శాలువాలతో గజమాలతో ఘనంగా సత్కరించారు. పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమెతో ఉన్న అనుబంధాన్ని, జ్ఞాపకాలను పంచుకున్నారు. ఉపాధ్యాయురాలు లక్ష్మీదేవి ఆమెతో ఉన్న అనుబంధాన్ని కవితా రూపంలో చదివి వినిపించారు. ఉపాధ్యాయురాలు రాజేశ్వరి సన్మాన పత్రాన్ని చదివి వినిపించారు. కర్నూలు డైట్ కళాశాల సీనియర్ ఆధ్యాపకులు మువ్వా గోవిందు మాట్లాడుతూ... కల్పనతో పాటు ఆమె కుటుంబంతో తనకు ఎంతో సాన్నిహిత్య సంబంధాలు ఉన్నాయన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండే సంస్కారం ఆమె నైజం అన్నారు. నిజాయితీ నిబద్ధతకు అంకితభావానికి ఆమె మారుపేరుగా నిలుస్తుందని అన్నారు. కల్లూరు ఎంఇఒ వనజ మాట్లాడుతూ.. ఆమె తన పాఠశాలలో ప్రత్యేక పరిపాలనను కొనసాగిస్తూ బలమైన ముద్రలు వేసి వాటిని ఆమె వదిలి వెళుతున్నా అవి తమకు ఎప్పటికీ జ్ఞాపకాలుగా నిలుస్తాయన్నారు. ఆమె గురించి ఆమె వ్యక్తిత్వం, నిబద్ధత, గురించి కేవలం పాఠశాలలోనే కాకుండా నా సొంత కుటుంబంలోనూ, బంధువులలో నుంచి కూడా బలంగా వినిపించిందన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు అనసూయ, సీనియర్ స్కూల్ అసిస్టెంట్ శివప్రసాద్ రెడ్డి మాట్లాడారు. అల్లుడు ఎఫ్‌సిఐ మేనేజర్ ప్రదీప్ మాట్లాడుతూ అత్తమామలు తన తల్లిదండ్రులను చూస్తున్నానని అన్నారు. కూతురు డాక్టర్ స్నేహ మాట్లాడుతూ.. అమ్మ తనకు ఓ విజ్ఞాన పుస్తకం అని అన్నారు. నంద్యాల జిల్లా సిఐటియు నాయకులు రమేష్ మాట్లాడుతూ విద్యార్థి దశలో అభ్యుదయ భావాలతో నడిచిందన్నారు. 38 ఏళ్లుగా నిరాటంకంగా విద్యార్థులకు సేవలందించడం అభినందనీయమన్నారు. నిర్మల మాట్లాడుతూ పదవురికి కాంతిని పంచే కొవ్వొత్తి జీవిత స్ఫూర్తి కల్పనది అన్నారు. గోదాదేవి , పూర్వ విద్యార్థి శివనాగలింగం మాట్లాడారు. గ్రామ సర్పంచి దామోదర్ నాయుడు, గ్రామ పెద్దలు, పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


హెచ్‌ఎం కల్పన, ధనుంజయ దంపతులను సన్మానిస్తున్న అతిథులు

నేటి నుండి ఇంటర్ పరీక్షలు

-69 పరీక్ష కేంద్రాల్లో నిర్వహణ-సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ
-కొన్ని పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు లేమి

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు శనివారం నుండి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షా నిర్వహణను సీసీ కెమెరాలు ద్వారా ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు పూర్తిస్థాయిలో వసతులు కల్పించలేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నారు. కర్నూలు జిల్లాలో 69 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి ఈ పరీక్షలకు మొత్తం45,325 మంది విద్యార్థులు రాయనున్నారు. మొదటి సంవత్సరం 23,098 మంది విద్యార్థులు, రెండవ సంవత్సరం 22227 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడం జరిగిందన్నారు. 7 పరీక్షా కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. . పరీక్షల పర్యవేక్షణకు 3ఫ్లయింగ్ స్క్వాడ్స్, 6 సిట్టింగ్ స్క్వాడ్స్, బృందాల ద్వారా పర్యవేక్షణ చేయనున్నారు. గతంలో ఇంటర్ పరీక్ష రాసే విద్యార్థులకు పూర్తిస్థాయి వసతులు లేకపోవడంతో అనేక అవస్థలు పడ్డారు. కొన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు నేలపై కూర్చొని రాసిన ఘటనలు న్నాయి.

విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

రంగప్ప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఎఫ్ ఐ



ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి. గతంలో విద్యార్థులకు రాసేందుకు బెంచీలు కూడా లేకపోవడంతో అవస్థలు పడ్డారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు బెంచీలు ఏర్పాటు చేయడమే కాకుండా తాగునీరు ఇతర సౌకర్యాలు కల్పించాలి

సౌత్ సెంటర్ వెడ్డింగ్ మాల్ ప్రారంభం

ప్రత్యేక ఆఫర్లతో కిక్కిరిసిన జనం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్‌లో సౌత్ సెంటర్ వెడ్డింగ్ మాల్ ను ఆ షోరూం డైరెక్టర్లు ఇలియాజ్ , ఇజస్ ప్రారంభించారు. ప్రారంభ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ఉండడంతో షోరూం జనంతో కిక్కిరిసింది. ఈ సందర్భంగా షోరూం డైరెక్టర్లు ఇజస్ ,ఇలియాజ్ మాట్లాడారు ఇప్పటికే మొదటి షాపింగ్ మాల్ కు వినియోగదారుల నుండి అత్యధిక ఆదరణ ఉండటంతో రెండవ షోరూం ప్రారంభిచామన్నారు. ఇందులో పురుషులు , స్త్రీలకు కావలసిన వస్త్రాలు ప్రత్యేకంగా పెళ్లిళ్లకు ఎన్నో కొత్త కలెక్షన్స్ ఇక్కడ లభిస్తాయన్నారు .మా షోరూం కు వినియోగదారుల నుండి మేము ఈ ఆదరణ పొందటానికి అందరికి అందుబాటు ధరల్లో మా వద్ద కలెక్షన్స్ ఉంటాయన్నారు. ప్రారంభం సందర్భంగా ఎన్నో ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నామని కర్నూలు ప్రజలు షోరూంను సందర్శించి ఈ ఆఫర్లను వినియోగించుకోవాలన్నారు.



ప్రత్యేక ఆఫర్లకోసం ఎగబడిన జనం



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

లోకేష్ బందోబస్తుపై ఎస్పీ ఆరా

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్ర మంత్రి నారా లోకేష్ మంత్రాలయం పర్యటనలో భాగంగా చేపట్టిన పోలీసు బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. శుక్రవారం మంత్రాలయం చేరుకున్న ఆయన డీఎస్పీ ఉపేంద్ర బాబు, సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజుల్, టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డితో కలిసి శ్రీమఠం, హెలిప్యాడ్ తదితర ప్రాంతాల్లో ఉంచాల్సిన నిఘాపై ఆరా తీశారు.

రబీ రైతులను ఆదుకోవాలి

- సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్



మాట్లాడుతున్న వీరశేఖర్

ప్రజాశక్తి - దేవనకొండ

రబీ సీజన్‌లో తుఫాన్, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో దిగుబడి లేక తీవ్ర నష్టానికి గురైన వేరుశనగ, మిరప రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఎఒ సురేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు యూసుఫ్ బాషా అధ్యక్షత వహించారు. నాయకులు వీరశేఖర్, అశోక్ మాట్లాడుతూ... రబీ సీజన్ ప్రారంభం నుంచి వాతావరణం వ్యవసాయానికి అనుకూలించలేదని తెలిపారు. తుపాను ప్రభావంతో వేరుశనగ, మిరప, ఇతర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఎకరాకు వేరుశనగ 3 నుంచి 5 బస్తాలు మాత్రమే వస్తున్నాయని చెప్పారు. రబీ సీజన్‌లో సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దేవనకొండను కరువు మండలంగా ప్రకటించి వేరుశనగ, మిరప రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని కోరారు. ఇన్స్యూరెన్స్ సౌకర్యం వర్తింపజేసేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. కార్పొరేట్ సంస్థల అధిపతులకు రూ.వేల కోట్లు మాఫీ చేసే ప్రభుత్వ పెద్దలు రైతుల దగ్గరకు వచ్చేసరికి లాభనష్టాలు లెక్కేసుకుంటున్నారని మండిపడ్డారు. రైతన్నకు అప్పుల బాధలు ఉండడం దేశానికి మంచిది కాదని, రైతులకు సంపూర్ణ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, సిపిఎం నాయకులు శ్రీనివాసులు, రాయుడు, బలరాముడు, వీరన్న, సూర్యచంద్ర, బిస్మిల్లా, చెన్నకేశవులు, రామాంజనేయులు, వెంకటనారాయణ, రంగన్న పాల్గొన్నారు.

అరుపులు, గొడవలతో మున్సిపల్ సమావేశం

- ప్రజా సమస్యలను గాలికొదిలిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు మున్సిపల్ సమావేశంలో అరుపులు, గొడవలతో సాగింది. కౌన్సిలర్లు ప్రజాసమస్యలను గాలికొదిలేయడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వైసిపి, టిడిపి సభ్యుల మధ్య వాదోపవాదాలు, అరుపులు, కేకలతో ముగిసింది. వార్డుల్లో సమస్యలను పరిష్కరించాలని అడగాల్సిన కౌన్సిల్ సభ్యులు మొక్కుబడిగా ఒకటి, రెండు సమస్యలు ఎవరో ఒకరు అడిగి చేతులు దులుపుకుంటున్నారు. వార్డు ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నారు. ఇవేమీ పట్టని సభ్యులు సమస్యలకు పాతరేసి కౌన్సిల్‌ను రచ్చ కట్టగా మార్చుతున్నారు. వ్యక్తిగత అజెండాతో ఒకరిపై ఒకరు పరస్పర ధూషణలతో సమావేశాన్ని గొడవలకు వేదికగా మార్చుతున్నారు. పవిత్ర రంజాన్ మాసం ఏర్పాట్లకు సంబంధించిన అంశాలను చర్చించకుండా సమాధానాలు చెప్పలేక బెల్ కొట్టిమని ముగించారు. పట్టణ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సభ్యుల తీరు ఎప్పటికీ మారుతుందో, సమస్యలు ఎప్పుడు పరిష్కారమవుతాయోనని ఎదురు చూస్తున్నారు.






సమావేశంలో వాగ్వాదం చేసుకుంటున్న కౌన్సిలర్లు

మంత్రి లోకేష్ పర్యటనపై జెసి సమీక్ష

ప్రజాశక్తి - మంత్రాలయం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెసి, నాయకులు

రాష్ట్ర విద్యా, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటనపై జెసి డాక్టర్ బి.నవ్య సమీక్ష నిర్వహించారు. శ్రీమఠంలో జరిగే కార్యక్రమాలపై ఆరా తీశారు. శుక్రవారం స్థానిక శ్రీమఠం చేరుకున్న జెసి శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు, టిడిపి ప్రముఖ నాయకులు, డీఎస్పీ ఉపేంద్ర బాబు, సిఐ రామాంజులుతో కలిసి పలు విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. మంత్రి లోకేష్ పర్యటన ఏర్పాట్లను అందరితో కలిసి పరిశీలించారు. ప్రధాన రహదారిలో నూతనంగా నిర్మించిన కేరిడార్‌తో పాటు డివైడర్‌ను ప్రారంభించి మంత్రి లోకేష్ బయల్దేరుతారని జెసి, నాయకులు తెలిపారు. టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డిలు ఎవరికి వారు తమ బలాన్ని చూపించే ప్రయత్నం చేస్తున్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, టిడిపి ఆదోని ఇన్‌ఛార్జీ కె.మీనాక్షి నాయుడు, మాజీ మంత్రి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కెఇ.ప్రభాకర్, మంత్రాలయం ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి సీనియర్ నాయకులు కె.ఉమాపతి నాయుడు, రాష్ట్ర కార్యదర్శులు పాలకుర్తి శ్రీనివాసులు రెడ్డి, వై.నాగేశ్వర రావు యాదవ్, టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఎల్లారెడ్డి, మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్‌నాథరెడ్డి, బీసీ సెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ, హండే అనుమంతు, చిన్న భీమా, తిక్కస్వామి గౌడ్, టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ బి.వరదరాజులు, నాయకులు అశోక్ రెడ్డి, ఎంపిటిసి ఎంబి.వెంకటేష్, గణేకంటి రామకృష్ణ పాల్గొన్నారు.

రైతు సంబరం కోసం పోటీలు

- ఎమ్మెల్యే విరపాక్షి

- బిణిగేరిలో అంతర్ రాష్ట్ర ఎద్దుల బలప్రదర్శన పోటీలు

ప్రజాశక్తి - ఆస్పరి

మహా శివరాత్రి సందర్భంగా రైతుల సంబరాల కోసం ఎద్దుల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తారని ఎమ్మెల్యే బి.విరుపాక్షి తెలిపారు. మండలంలోని బిణిగేరి గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన శ్రీపంచలింగేశ్వర స్వామి శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ నిర్వాహకులు శ్రీనివాసనాయన, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో అంతర్ రాష్ట్ర ఎద్దుల బలప్రదర్శన పోటీలను ఎమ్మెల్యే బి.విరుపాక్షి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత 4 ఏళ్లుగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామని, పోటీల్లో 8 జతల ఎద్దులు పాల్గొన్నాయని చెప్పారు. హెచ్.కైరవాడికి చెందిన రైతు లక్ష్మన్న ఎద్దులు 3,768 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలువగా మొదటి బహుమతి రూ.50 వేలు ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అందజేశారు. నందవరం గ్రామానికి చెందిన మహేష్ ఎద్దులు 3,624 అడుగులు లాగి రెండోస్థానంలో నిలువగా రూ.40 వేలను టిడిపి నాయకులు అందజేశారు. యనగండ్ల గ్రామానికి చెందిన బాయికాటి బొడన్న ఎద్దులు 3,3471 అడుగులు లాగి మూడోస్థానంలో నిలువగా రూ.30 వేలను జడ్‌పిటిసి దొరబాబు అందజేశారు. బళ్లారి, అనంతపురం జిల్లాకు చెందిన రైతులు రమేష్ బాబు, అనిల్ కుమార్ ఎద్దులు 3,346 అడుగులు లాగి నాలుగో స్థానంలో నిలువగా రూ.20 వేలను ఎంపిపి సుంకర ఉమాదేవి, రామాంజనేయులు అందజేశారు. కర్నూలు జిల్లా మునగల గ్రామానికి చెందిన హనుమన్న ఎద్దులు 3,339 అడుగులు లాగి ఐదో స్థానంలో నిలువగా రూ.10 వేలను శంకరబండ సర్పంచి విజయలక్ష్మి, పురుషోత్తం రెడ్డి బహుమతులు అందజేశారు. మిగిలిన జట్లకు కన్సోలేషన్ బహుమతి కింద రూ.5 వేలను ఆలయ కమిటీ ద్వారా అందజేశారు. సర్పంచి వెంకటేష్, ప్రముఖ పారిశ్రామిక వేత్త విట్టా రమేష్, ప్రతాప్, వైసిపి కన్వీనర్ బసవరాజు, సొసైటీ మాజీ ఛైర్మన్ గోవర్ధన్, కెడిసిసి జిల్లా బ్యాంకు మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర, వైసిపి ఆలూరు తాలూకా యూత్ అధ్యక్షులు అశోక్, ఎంపిటిసి రాధాకృష్ణ, వైసిపి మాజీ కన్వీనర్లు రామాంజనేయులు, పెద్దయ్య, కేశవరెడ్డి, నాయకులు భీమన్న, వెంకటేష్, దత్తాత్రేయ రెడ్డి, చిన్నరెడ్డి, మోహన్, శంకరయ్య, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శేషాద్రి నాయుడు, టిడిపి నాయకులు నారాయణ, శ్రీనివాసులు, రంగస్వామి, తిక్కయ్య పాల్గొన్నారు.



ఎద్దుల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి



ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

ముగిసిన అంగన్వాడీ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని డివిజన్ పరిధిలో అంగన్వాడీ ఇంటర్వ్యూలు ముగిశాయని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఐసిడిఎస్ పీడీ నిర్మల దేవి తెలిపారు. శుక్రవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదోని డివిజన్‌కు సంబంధించి అంగన్వాడీ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడారు. డివిజన్‌లో 6 అంగన్వాడి వర్కర్స్ ఖాళీలకు 25 మంది దరఖాస్తు చేసుకున్నారని, 23 మంది హాజరయ్యారని తెలిపారు. అంగన్వాడీ హెల్పర్స్ 40 ఖాళీలు ఉండగా 174 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. 154 మంది హాజరయ్యారని తెలిపారు. విద్యార్హత, సమాజం పట్ల అవగాహన, ఐసిడిఎస్ కార్యక్రమాల అమలు గురించి ఇంటర్వ్యూలో అడిగారని అభ్యర్థులు తెలిపారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, సిడిపిఒలు ఉమా మహేశ్వరి, సఫరున్నీసా బేగం, నాగమణి, ఐసిడిఎస్ కార్యాలయ అధికారి శంకర్ ఉన్నారు.




బంటనహాల్‌లో రీసర్వేను పరిశీలిస్తున్న తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్

రీసర్వేలో తప్పులుంటే చర్యలు

- తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్

ప్రజాశక్తి - చిప్పగిరి

రీసర్వేలో తప్పులుండకుండా చూసుకోవాలని తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ విఆర్ఒ మీనాకు, సర్వేయర్లకు సూచించారు. శుక్రవారం బంటనహాల్ గ్రామంలో రీసర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఒక పొలం సర్వే చేస్తున్న సమయంలో ఇరువైపులా ఉన్న రైతులందరికీ సమాచారం ఇచ్చి కొలతలు వేయాలని, అప్పుడే సమస్య రాకుండా ఉంటుందని తెలిపారు. రైతులందరికీ ముందుగానే సమాచారం ఇస్తున్నందువల్ల నేటి వరకు సమస్యలు లేకుండా దాదాపు 80 శాతం రీసర్వే పూర్తయిందని చెప్పారు. తమ సిబ్బందికి రైతులందరూ సహకరిస్తే రీసర్వే పనులను వందశాతం పూర్తి చేస్తామన్నారు. మండల సర్వేయర్ నారాయణ, విఆర్ఒ పెద్దన్న, రైతులు పాల్గొన్నారు.



నేటి నుంచి శ్రీగురు వైభవోత్సవాలు

ప్రజాశక్తి - మంత్రాలయం

తుంగభద్ర నదీతీరంలో వెలసిన శ్రీరాఘవేంద్రస్వామి గురువైభవోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 6 వరకు జరిగే గురు వైభవోత్సవాల్లో మొదటి రోజు శ్రీరాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారు. అనంతరం రాఘవేంద్రుని పట్టాభిషేక మహోత్సవం సందర్భంగా, శ్రీరాఘవేంద్ర స్వామి స్వర్ణ పాదుకలకు, ముత్యాలు, పుష్పాలతో అభిషేకం నిర్వహిస్తారు. 6న శ్రీరాఘవేంద్ర స్వామి జన్మదిన వేడుకల సందర్భంగా స్వామి మూల బృందావనానికి వేయి లీటర్లతో విశేష క్షీరాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహిస్తారు. టిటిడి నుంచి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. తమిళనాడు రాష్ట్ర చెన్నైకి చెందిన సంగీత కళాకారులతో నాదహార సంగీత కార్యక్రమం నిర్వహిస్తారు. గురు వైభవోత్సవాల సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన ప్రముఖులకు శ్రీరాఘవేంద్ర స్వామి అనుగ్రహ ప్రశస్తి అవార్డులను ప్రదానం చేస్తారు. ఆరు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా శ్రీమఠం ఆవరణలోని యోగీంద్ర కళామండపంలో ప్రముఖ విద్వాన్, పండితుల ప్రసంగాలు, వివిధ పుస్తకాల ఆవిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. శ్రీప్రహ్లాద రాయలను వివిధ రథోత్సవాలపై ఉంచి మఠం ప్రాకారంలో అశేష భక్తుల నడుమ ఘనంగా ఊరేగిస్తారు.

బడ్జెట్‌లో అందరికీ న్యాయం

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

బడ్జెట్‌లో అన్ని వర్గాలకూ న్యాయం జరిగిందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల ఆమోదయోగ్యంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన మొదటి పూర్తిస్థాయి బడ్జెట్‌లో సంక్షేమానికి, అభివృద్ధికి, హామీల అమలుకు ప్రాధాన్యత ఇచ్చి స్వర్ణాంధ్ర నిర్మాణానికి బాటలు వేసినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న గుడిసె ఆది కృష్ణమ్మ

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

- రౌండ్‌టేబుల్‌లో అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ శాఖలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదోనిలోని అనంతమంగళం ఆంజనేయస్వామి కల్యాణ మండపంలో ఆదోని మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల 'రౌండ్ టేబుల్' సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఒబి.నాగరాజు అధ్యక్షత వహించారు. సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి పిఎస్.గోపాల్, తిప్పన్న, ఐఎన్‌టియుసి నాయకులు దేవిశెట్టి ప్రకాష్, ఎఐటియుసి నాయకులు అజయ్ బాబు, వైటి.భీమేష్, కల్లుబావి రాజు, సి.హుస్సేని, రైతు, వ్యకాస నాయకులు జి.ఎల్లప్ప, కొత్తూరు గంగన్న, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు జాన్ బాబు, జయరాజు, లక్ష్మన్న, నరసింహులు అర్జున్ హాజరై మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు గత సమ్మె కాలంలో ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందం ప్రకారం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఆప్కాస్‌ను రద్దు చేసే విధానాలు మానుకోవాలని తెలిపారు. పిఎఫ్, ఇఎస్ఐ, సెలవులు, విధుల అప్పగింత ప్రయివేట్ ఏజెన్సీలకు ఇచ్చే ఆలోచనలు విరమించుకోవాలన్నారు. పెరుగుతున్న జనాభాకణుగునంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, కాంట్రాక్టు కార్మికుల విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకు ఈనెల 17 నుంచి దశలవారీ ఆందోళనలు కొనసాగిస్తున్నామని హెచ్చరించారు. ఈనెల 3న సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఈనెల 6న చలో విజయవాడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు చెప్పారు.



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నేడు 'రావూస్'లో రక్తదాన శిబిరం

- కళాశాల కరస్పాండెంట్ తిరుమలరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో శనివారం 'రోటరీ క్లబ్' ఆధ్వర్యంలో రక్తదాన శిబిర నిర్వహిస్తున్నామని కళాశాల కరస్పాండెంట్ తిరుమల రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులతో పాటు గ్రామీణ, పట్టణ యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు నటరాజ్ రెడ్డి, ఆర్గనైజర్ నాగరాజ్, కార్యదర్శి సుధాకర్ రావు హాజరవుతున్నారని తెలిపారు. ఇతర వివరాలకు 08512-256799, 7799921656 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

ప్రత్యేక గుర్తింపు సంఖ్య తప్పనిసరి : ఎఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

పొలం ఉన్న ప్రతి రైతూ ప్రత్యేక గుర్తింపు సంఖ్యను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఎఒ జయలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె చిప్పగిరి రైతు సేవా కేంద్ర కార్యాలయంలో మాట్లాడారు. మండలంలో ఇప్పటివరకు కేవలం 4,700 మంది మాత్రమే గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకున్నారని తెలిపారు. నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం గడువు పొడిగిస్తుందా లేదా అనేది తమకు సమాచారం లేదన్నారు. రైతులు మాత్రం తప్పనిసరిగా దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో ప్రత్యేక విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలన్నారు. పిఎం కిసాన్‌కు 6,369 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా 2,675 మందికి ఫిబ్రవరి 24న అర్హత పొందారన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు రంగస్వామి, ప్రతాప్, మనోహర్ పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఈరన్న స్వామి దేవస్థాన శాశ్వత అన్నదానానికి కర్నూలుకు చెందిన నున్న గాజుల రాజేశ్వరి రూ.50 వేల విరాళం అందజేశారని డిప్యూటీ కమిషనర్, ఇఒ మేడిపల్లి విజయ రాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. పుణ్యక్షేత్రంలో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, భక్తులు విరాళాలు అందించి అభివద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు. సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, కోట్రేష్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రజా సేవకుడు ఎంపిడిఒ సుబ్బరాజు

- వివిధ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో సన్మానం

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం ఎంపిడిఒగా మండల ప్రజలకు ఎన్నో సేవలందించి ప్రజా సేవకునిగా పేరు తెచ్చుకున్న ఘనత ఎంపిడిఒ సుబ్బరాజుకే దక్కుతుందని వివిధ పార్టీల నాయకులు తెలిపారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో విరమణ సభలో విరమణ పొందిన సుబ్బరాజును సన్మానించారు. వైసిపి రాష్ట్ర యువ నాయకులు వై.ప్రదీప్‌రెడ్డి, ఉరుకుంద దేవస్థానం డిప్యూటీ కమిషనర్ విజయ రాజు, వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, ఎంపిపి అమ్రేష్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కోఆప్షన్ సభ్యులు మాబు సాబ్, సర్పంచి పాల్ దినకరన్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి వెంకటపతిరాజు, సతీష్ నాయుడు మాట్లాడారు. జిల్లా కేంద్రానికి మారుమూల ప్రాంతమైన కౌతాళం మండలంలో పని చేస్తూ ఉత్తమ ఎంపిడిఒగా సుబ్బరాజు కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారంటే ఆయన అందించిన సేవలు ఎలాంటివో అందరికీ అర్థమవుతుందని తెలిపారు. ఇలాంటి అవార్డులు రావడానికి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ఉంటుందన్నారు. సిబ్బంది కొరత ఉన్నా మండల ప్రజలకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పథకాలను ముందుకు తీసుకెళ్లి రాజకీయ పార్టీలకతీతంగా మన్ననలు పొందారని కొనియాడారు. ఎంపిడిఒ సేవలందించి విరమణ పొందిన సుబ్బరాజుకు పూలమాలలు, శాలువాతో సన్మానించారు. ఇఒఆర్‌డి యోగేశ్వర్ రెడ్డి, వైసిపి నాయకులు వెంకట్రామిరెడ్డి, సుబ్బరాజు, గురునాథ్ రెడ్డి, శివరాం, టిడిపి నాయకులు చౌదరి బసవరాజు, వీరేష్, రాజానందు పాల్గొన్నారు.





ఎంపిడిఒను సన్మానిస్తున్న నాయకులు

ఆర్‌డిటి సముదాయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని విరుపాపురం గ్రామంలో ఆర్‌డిటి సముదాయ నూతన భవనం పాఠశాల, కమ్యూనిటీ హాలును శుక్రవారం సర్పంచి ప్రహ్లాద యాదవ్, ఆర్‌డిటి సంస్థ ముఖ్య అతిథుల చేతులమీదుగా ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఆర్‌డిటి సముదాయ భవనానికి సర్పంచి స్థలం కేటాయించి కృషి చేసినందుకు ఆర్‌డిటి తరపున ముఖ్య అతిథులు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచి ప్రహ్లాద యాదవ్ మాట్లాడుతూ... ఆర్‌డిటి సంస్థ ద్వారా గ్రామంలో ఇలాంటి భవనం నిర్మించి తమ చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు. సర్పంచిగా పదవిలో ఉన్నంత వరకు ఆర్‌డిటి సంస్థకు సహకారాలు అందిస్తానని చెప్పారు. ఆర్‌డిటి ఛైర్మన్ తిప్పేస్వామి, అనంతపురం ఆర్‌డి సరస్వతి, ఆదోని రీజనల్ డైరెక్టర్ హనుమంతప్ప, ఆలూరు ఏరియా జయసింహ పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి ప్రహ్లాద్ యాదవ్


పిఆర్‌సి అమలుకు కేటాయింపులేవీ..?

ఆదోని : బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా పిఆర్‌సిని ఎలా అమలు చేస్తారని ఎస్‌టియు రాష్ట్ర సహాధ్యక్షులు నాగరాజు, రాష్ట్ర పురపాలక కన్వీనర్ జి.వీరచంద్ర యాదవ్, రాష్ట్ర మాజీ కౌన్సిలర్ ఎస్.లోక్య నాయక్ ప్రశ్నించారు. శుక్రవారం మున్సిపల్ హైస్కూల్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం విద్యా రంగాభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాలని కొఠారి కమిషన్ చెప్పిందని, పట్టించుకోకుండా పాఠశాల విద్యాశాఖకు రూ.31,805 కోట్లు (9.88 శాతం) కేటాయించడం సిగ్గుచేటన్నారు. నాయకులు ప్రహ్లాద, భీమరాజు, మారయ్య, జి.శ్రీనివాసులు, విజయ్ కుమార్, శ్రీరాములు, గంగ నాయక్ ఉన్నారు.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో 'ది ఎమ్మిగనూరు టైలర్స్ అసోసియేషన్' ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకలను టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగభూషణం అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మిగనూరు టైలర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి ఆదోని ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి హాజరై కేక్ కట్ చేసి టైలర్లకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టైలర్లు ముఖ్య అతిథులను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడారు. టైలర్లకు అండగా ఉంటామని తెలిపారు. అనంతరం దివాకర్ రెడ్డి ప్రభుత్వాస్పత్రిలో రోగులకు, బాలింతలకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. **దేవనకొండ** మూగితాత దర్గా కమ్యూనిటీ హాలులో టైలర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ టైలర్లను సన్మానించి వారికి దుస్తులు అందజేశారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ టైలర్ రంగన్న, కరీం, అజీజ్ మాట్లాడారు. అందరూ ఐకమత్యంతో ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం పోరాటం చేయాలన్నారు. సమస్యలు వచ్చినప్పుడు సహాయ, సహకారాలు అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. **కోసిగి** మండలంలోని టైలర్లకు ఇళ్ల స్థలాలతోపాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ టైలర్స్ యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ రుద్ర గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో రైతుసంఘం నాయకులు వీరేష్, టైలర్స్ యూనియన్ నాయకులు కృష్ణ, నర్సిరెడ్డి, వీరేష్ మాట్లాడారు. కోసిగిలో దాదాపు 200 మంది టైలర్లు వృత్తి చేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. చాలామందికి సొంత ఇళ్లు లేవని, ప్రస్తుత పరిస్థితుల్లో టైలర్ వృత్తి చాలా కష్టంగా మారిందని తెలిపారు. మెటీరియల్ రేట్లు పెరిగిపోవడం, మరోవైపు రెడీమేడ్ బట్టలు రావడం వల్ల టైలర్లకు ఉపాధి తగ్గిందని చెప్పారు. ఇంటి అద్దెలు, కుటుంబ పోషణ భారమైపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. టైలర్స్ యూనియన్ నాయకులు మల్లేష్, తిక్కన్న, హరికృష్ణ, రాజేష్, వీరేష్, రాముడు, మహేష్, మహదేవా, ఉల్లిగయ్య, మారయ్య పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో వేడుకలకు హాజరైన టిడిపి నాయకులు

మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ వెంకటరమణారెడ్డి



విద్యాభివృద్ధికి సుదర్శన్ రెడ్డి కృషి

- ఘనంగా సుదర్శన్ రెడ్డి విరమణ సభ

ప్రజాశక్తి - నందవరం

మండలంలో 8 ఏళ్లుగా ఎంఇఒ సుదర్శన్ రెడ్డి విద్యాభివృద్ధికి కృషి చేసి జిల్లా ఉత్తమ ఎంఇఒ అవార్డు అందుకున్నారని ముఖ్యఅతిథులు కొనియాడారు. శుక్రవారం ఎంఇఒ సుదర్శన్ రెడ్డి విరమణ పొందారు. ఆయనకు ఎంఇఒ-2 రఘునాథ్ ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించారు. మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఎంఇఒలు పాల్గొని సుదర్శన్‌రెడ్డిని సన్మానించారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ డిఇఒ వెంకటరమణారెడ్డి, ఎంపిడిఒ పుల్లయ్య, ముగితి సర్పంచి విరుపాక్షిరెడ్డి, టిడిపి నాయకులు మాచాపురం ఖాసీం వలీ, ధర్మపురం గోపాల్ హాజరయ్యారు. ముఖ్యఅతిథులు మాట్లాడుతూ... సుదర్శన్‌రెడ్డి పాఠశాలలను పర్యవేక్షిస్తూ.. నిరంతరం పాఠశాలల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి కృషి చేశారని తెలిపారు.

దళిత చర్మకారుల అంగళ్లకు రక్షణ కల్పించాలి

- ఆంధ్రప్రదేశ్ దళిత చర్మకారుల సంఘం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దళిత చర్మకారుల అంగళ్లకు రక్షణ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ దళిత చర్మకారుల సంఘం జిల్లా అధ్యక్షులు ఆంథోని, సిఐటియు పట్టణ కార్యదర్శి గోవిందు డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలో దళితులు కూడళ్లలో చిన్న చిన్న బంకులు పెట్టుకొని, చెప్పులు కుట్టుకొని జీవిస్తున్నారని తెలిపారు. వారి జీవనోపాధికి ప్రభుత్వం నుంచి ఆదరణ లేదని విమర్శించారు. ఉపాధి లేక కొంతమంది వలసలు వెళ్తున్నారని, మరి కొంతమంది ముంబయి, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లి ఏదో ఒక వృత్తి చేస్తున్నారని తెలిపారు. దళిత చర్మకారులకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని, వారికి బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఆ పని చేయకపోగా.. ఏదో ఒక మూలన బంకు పెట్టుకుని చెప్పులు కుట్టుకునే వారి బంకులను స్థానిక మున్సిపల్ అధికారులు ఎత్తేయడం అమానుషమని మండిపడ్డారు. సోమప్ప కూడలిలో బాబు అనే చర్మకారుడు చిన్న బంకు వేసుకోగా గత రాత్రి మున్సిపల్ అధికారులు తొలగించారని తెలిపారు. దిక్కు తోచని చర్మకారులు మున్సిపల్ కార్యాలయాన్ని ఆశ్రయించారని, బంకులను తొలగించవద్దని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇతరులకు ఇబ్బంది లేకుండా వృత్తిని కొనసాగించవచ్చని మున్సిపల్ కమిషనర్ హామీ ఇచ్చారు. సిఐటియు నాయకులు రమేష్, కెవిపిఎస్ నాయకులు మెకానిక్ రాజు, ఆనంద్, బాబు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న చర్మకారులు, సిఐటియు నాయకులు



మాట్లాడుతున్న విశ్రాంత ఐపిఎస్ అధికారి నారాయణ

తెర్నేకల్ పాఠశాలకు విశ్రాంత ఐపిఎస్ విరాళం

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ మండలం తెర్నేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి విశ్రాంత ఐపిఎస్ అధికారి నారాయణ శుక్రవారం రూ.75 వేల విరాళం అందజేశారు. తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. గత కొన్ని నెలల క్రితం తెర్నేకల్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాఠశాలలో ఉన్న సమస్యలను పూర్వ విద్యార్థుల దృష్టికి తీసుకెళ్ళారు. అందుకు స్పందించిన పూర్వ విద్యార్థి, విశ్రాంత ఐపిఎస్ అధికారి నారాయణ తనవంతుగా రూ.75 వేలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ... పాఠశాల అభివృద్ధికి ఇప్పటివరకు ఎన్నో కార్యక్రమాలను తెర్నేకల్ ఉద్యోగుల సంఘం తరపున చేశామని, ఇకముందు కూడా చేస్తామని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు అనిల్ కుమార్ నారాయణ, తెర్నేకల్ ఉద్యోగుల సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ... పాఠశాలలో దాదాపు 500 మంది విద్యార్థినులు ఉన్నారని, సరైన మూత్రశాలలు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దానికి పరిష్కారంగా పాఠశాల ప్రహరీపై రేకులతో ఎత్తయిన నిర్మాణాన్ని చేపట్టడం ద్వారా విద్యార్థినుల సమస్యకు పరిష్కారం లభించిందని చెప్పారు. తెర్నేకల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సుధాకర్ బాబు, ప్రధాన కార్యదర్శి వెంకప్ప, కోశాధికారి రాజశేఖర్, నాయకులు మధుసూదన్, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

'పది'లో మంచి మార్కులు సాధించాలి

- బండమీది వెంకటేశ్వర్లు సేవాసమితి



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న గిడ్డయ్య

ప్రజాశక్తి - ఆస్పరి

పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని బండమీది వెంకటేశ్వర్లు సేవాసమితి అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డయ్య, విరుపాక్షి ఆకాంక్షించారు. శుక్రవారం మండలంలోని కైరుప్పల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సేవాసమితి ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, స్కేల్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు జీవితంలో ఏదైనా సాధించాలంటే పదో తరగతి తొలి మెట్టు అని, ఎంత ఇష్టంగా చదివితే అంత మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సబ్జెక్టును ఇష్టంగా చదివి మండలానికి, పాఠశాలకు మంచి పేరు తేవాలని కోరారు. ప్రతేడాది పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన ముగ్గురికి సేవా సమితి ఆధ్వర్యంలో రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి చిరుకానుకగా ఇస్తున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు షఫీ, బండమీది వెంకటేశ్వర్లు సేవాసమితి ట్రెజరర్ రమేష్, ఉప సర్పంచి వెంకటేష్, నాయకులు వీరేష్, రంగేష్, చందు, సురేష్, రేవన్, ఉపాధ్యాయులు రామాంజనేయులు, ఇబ్రహీం, అనిల్ కుమార్ పాల్గొన్నారు.



మంత్రాలయం ఎంపిడిఒగా విరమణ పొందిన శోభారాణిని కార్యాలయ సిబ్బంది శుక్రవారం సన్మానించారు. విశ్రాంత ఉద్యోగిగా ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రాలయం

శాస్త్రీయ అవగాహన అవసరం

- నేషనల్ విద్యాసంస్థల అధినేత గోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న సమాజంలో ప్రతి ఒక్కరూ శాస్త్రీయ అవగాహన కలిగి ఉండాలని నేషనల్ విద్యాసంస్థల అధినేత గోపాల్ రెడ్డి తెలిపారు. నేషనల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సైన్స్ అధ్యాపకులు కిషోర్ కుమార్, సత్యవతి, రాధా, రజినీ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. నేషనల్ విద్యాసంస్థల అధినేత జి.గోపాల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఎస్.విజయ్ కుమార్, సత్యశ్రీ, జిఎస్ఆర్ పాఠశాల కోఆర్డినేటర్ ఎస్.వెంకటేశ్వర్లు, ప్రైమరీ పాఠశాల ఇన్‌ఛార్జి అనిల్ కుమార్ హాజరై విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలించారు. అంతకుముందు నోబెల్ గ్రహీత సర్ సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సైన్స్ అనేది నిజ జీవితంలో ఒక అంతర్భాగంగా ఏర్పడిందన్నారు. మూఢత్వంతో ఆలోచించకుండా శాస్త్రీయత తెలుసుకుని ముందుకు సాగాలని తెలిపారు. **నందవరంలోని** లిటిల్ జీనియస్ స్కూల్‌లో నేషనల్ సైన్స్ డేను ప్రిన్సిపల్ వి.తేజ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సివి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సైన్స్ ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వి.తేజ వివరించారు. విద్యార్థులు సౌజన్య అగ్నిపర్వతం, స్వాతిక హృదయం, మార్కండేయ మిస్సైల్ చిత్రాలను రూపొందించి ప్రతిభను కనబరిచారు. వారు రూపొందించిన చిత్రాల గురించి విద్యార్థులకు వివరించారు. కవిత, కుమారి, భాగ్యలక్ష్మి, సుమలత, సలీమా, ఉమా, వనజ, ఈరన్న పాల్గొన్నారు. **గోనెగండ్ల** ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని గంజహళ్లి, వేముగోడు పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎంఇఒ-2 నీలకంఠ, డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్ రంగమ్మ, గంజహళ్లి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రెడ్డి, వేముగోడు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడారు. ప్రతి విద్యార్థి సైన్స్‌పై పరిజ్ఞానం పెంచుకొని భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలని తెలిపారు. **హోళగుందలోని** అంబేద్కర్ ఎస్‌హెచ్‌జి వరలక్ష్మి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష సౌజన్యంతో నిర్వహిస్తున్న సీజనల్ హాస్టల్‌లో నేషనల్ సైన్స్ డే నిర్వహించారు. ఉదయం గ్రామీణ అభివృద్ధి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సి.హెచ్.నాగరాజు, సీజనల్ హాస్టల్ ఉపాధ్యాయులు సోహెల్, దుర్గయ్యలు సైన్స్ ప్రాజెక్టులు విద్యార్థులకు ప్రాక్టికల్‌గా చూపించారు. **దేవనకొండలోని** ఎపిఆర్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు ఉస్సేరప్ప ఆధ్వర్యంలో సైన్స్‌డే వేడుకలు నిర్వహించారు. 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు వివిధ రకాల సైన్స్ పరిశోధన ప్రదర్శనలు చేపట్టారు. 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు వర్షన్, యశ్వంత్, జోగేష్, శివమల్లిక, సింధుజ ప్రదర్శించిన లేజర్ సెక్యూరిటీ అలారం, యురేనియం వాటికి ప్రథమ బహుమతులు పాఠశాల యాజమాన్యం పంపిణీ చేశారు. ఫిజికల్ సైన్స్ టీచర్ ప్రవంతి పాల్గొన్నారు.



ఆదోనిలో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న గోపాల్ రెడ్డి



దేవనకొండలో...



హోళగుందలో...



గోనెగండ్లలో సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయులు



నందవరంలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నీడనిచ్చే చెట్లు బుగ్గిపాలు

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వాలు రూ.కోట్లు ఖర్చు చేసి రోడ్డు వెంట మొక్కలను నాటుతున్నా ఫలితాలు కనిపించడం లేదు. కొంతమంది మూర్ఖపు ఆలోచనలతో రోడ్డు వెంట ఉన్న పెద్ద చెట్లను కూడా బూడిద పాలు చేస్తున్నారు. నేమకల్లు బస్టాండ్ సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న పెద్ద వేప చెట్టుకు రాత్రి సమయంలో కొందరు అగ్గి తగిలించి పోయారు. ఉదయం చూసేసరికి చెట్టు అంతా కాలిపోయి కిందికి పడిపోయినట్లు పొలం యజమాని తెలిపారు. ప్రభుత్వాలు రోడ్డు వెంట మొక్కలను పెంచితే అవి పెద్దగా అయి నీడనిస్తాయని, రోడ్డు వెంట వెళ్లే వారు కూడా విశ్రాంతి తీసుకోవడానికి ఉంటుందని ప్రభుత్వాలు ఆలోచిస్తున్నాయి. కొంతమంది మూర్ఖపు పనులతో ఇలా చెట్లు బూడిద పాలవుతుండడం బాధ కలిగిస్తోందని పలువురు వాపోతున్నారు. ఆర్అండ్‌బి అధికారులు స్పందించి రోడ్డు వెంట అక్కడక్కడ పర్యావరణ బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు పక్కన ఉన్న చెట్టును కాల్చేసిన మూర్ఖులు




మినీ ట్యాంకు వద్ద వృథాగా పోతున్న తాగునీరు

తాగునీరు వృథా

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని గణేకల్లు గ్రామంలో తాగునీరు వృథాగా పోతోందని సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు బి.వీరారెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. గ్రామంలో తాగునీటి కోసం నాలుగు మినీ ట్యాంకులు ఏర్పాటు చేసిననట్లు తెలిపారు. రెండు మినీ ట్యాంకుల వద్ద నీరు వృథా అవుతున్నాయని చెప్పారు. మరో రెండు మినీ ట్యాంకుల నుంచి నీరందక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని, తాగునీటి వృథాను అరికట్టడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలం చెందారని విమర్శించారు. నీటి వృథాపై అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చిన సరి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. వేసవి ప్రారంభం కానుందని, తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా నీటి సమస్యను ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తాగునీటి వృథాను గుర్తించి సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. లేకపోతే గ్రామస్తులను సమీకరించి సచివాలయం ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు.



హామీల అమలుకు 10న చలో విజయవాడ

- సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - దేవనకొండ

గత సార్వత్రిక ఎన్నికల ముందు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఈనెల 10న చలో విజయవాడ నిర్వహిస్తున్నట్లు సిఐటియు మండల కార్యదర్శి అశోక్, యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి ఎస్.జ్యోతిలక్ష్మి తెలిపారు. శుక్రవారం అంగన్వాడీ వర్కర్స్ సమావేశంలో వారు మాట్లాడారు. కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పిఎఫ్, ఇఎస్ఐ, మౌలిక సదుపాయాలు, ఐసిడిఎస్‌లో మరిన్ని సేవల కోసం రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమ్మె సందర్భంగా ప్రభుత్వం రాతపూర్వక హామీ ఇచ్చిందని తెలిపారు. వాటిని అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇప్పటికే పలు దఫాలుగా అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. పరిష్కారం కాకపోవడంతో ఈనెల 10న విజయవాడ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని, మండలంలోని అంగన్వాడీలందరూ జయప్రదం చేయాలని కోరారు. అంగన్వాడీలు సరోజ, ఎర్రమ్మ, రియాబీ, భార్గవి, లక్ష్మీదేవి, వెంకటలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు



కాల్వబుగ్గలో రథోత్సవం

భారీగా తరలివచ్చిన భక్తజనం
ఎమ్మెల్యే గౌరు దంపతులు టిడిపి యువ నేత పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం కాల్వబుగ్గ రామేశ్వర స్వామి దేవాలయంలో రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రథోత్సవంలో ఉత్సవమూర్తులను ఊరేగింపు నిర్వహించారు.. రథోత్సవం వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాల్లో నుండి వందలాది భక్త జనం తరలి వచ్చారు. రథోత్సవాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది..ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ,టిడిపి సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డి, టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్ అనంతపురం టిడిపి యువ నాయకులు పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో వీరికి వేద పండితులచే స్వాగతం పలికిన అనంతరం కాల్వబుగ్గ రామేశ్వర స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు కల్లె లక్ష్మీనారాయణ శర్మ వారికి తీర్థప్రసాదాలను అంద జేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి నంద్యాల టిడిపి జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ కాల్వబుగ్గ దేవా లయ అభివృద్ధికి టిటిడి నిధులతో చర్యలు తీసుకోవడం జరుగు తుందన్నారు. ఈ ఏడాది ప్రశాంతంగా మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించారు. తహశీల్దార్ విద్యాసాగర్ ,ఎంపిడిఒ శ్రీనివాసులు, ఎస్సై సునీల్ కుమార్, ఆలయ ఈవో టీ మద్దిలేటి ఉత్సవ కమిటీ చైర్మన్ కాడినేని నారాయణ టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి టిడిపి సీనియర్ నాయకులు సి ఎస్ సుధాకర్ రెడ్డి హుసేనాపురం వాటర్షెడ్ కమిటీ చైర్మన్‌చంద్ర,పెద్దస్వామిఉన్నారు.

20 శాతం పూర్తయిన భూ రీ సర్వే

ప్రజాశక్తి సి బెళగల్

సి బెళగల్ మండలంలో చేపట్టిన భూసర్వే 20 శాతం పూర్తయిందని తహసీల్దార్ పురుషోత్తం పేర్కొన్నారు. శుక్రవారం మీడియాలో ఆయన మాట్లాడారు. మండలంలో పదివేల యాభైఆరు ఎకరాలుందని సర్వే చేపట్టగా శుక్రవారం తో 1900 ఎకరాలు పూర్తి అయిందని అన్నారు. రెండు సర్వే బృందాలు సర్వే చేస్తున్నాయని, ఈ సందర్భంగా మండల సర్వేయర్ నాగభూషణం పేర్కొన్నారు. భూ సర్వేలతో భూ సమస్యలు పరిస్కారం అవుతాయాని అందుకు రైతులు సహకరించాలని వారు సూచించారు.

కాటికాపరులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

11న విజయవాడలో కాటికాపరుల ఆందోళన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

స్మశానంలో గుంతలుతీసి పూడ్చే, కాల్చే కాటికాపరుల సమస్యలపై ఇప్పటికైనా అసెంబ్లీలో చర్చించి వృత్తి దారులుగా గుర్తించడంతో పాటు 4వ తరగతి ఉద్యోగులుగా నియమించాలని కోరుతూ మార్చి 11న విజయవాడలో జరిగే ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్‌జికెఎస్‌రాష్ట్ర కన్వీనర్ ఎండి.ఆనంద్ బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న కార్మిక కర్షక భవన్ లో కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.భాస్కర్ అధ్యక్షతన జిల్లా సదస్సును నిర్వహించారు. సదస్సును ఉద్దేశించి రాష్ట్ర కన్వీనర్ ఎండి. ఆనంద్‌బాబు, జిల్లా కార్యదర్శి ఎన్‌జి.కృష్ణ, కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు కె రంగమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ మాట్లాడారు. వారు మాట్లాడుతూ అంటరానితనాన్ని భరిస్తూ ఆదిమ కాలం నుండి చేస్తున్నవృత్తిని నేటికీ పాలకులు వృత్తిగా గుర్తించకపోవడం దళిత వృత్తుల పట్ల పాలకులకుండే వివక్షకు తార్కానమన్నారు. అంటూ, ముట్టు అంటూ సాంప్రదాయాల పేరిట సొంత కుటుంబ సభ్యున్ని సైతం సచ్చిన తర్వాత ముట్టుకునేందుకే భయపడ్డ కాలం నుండి, నేటి వరకు కరోనా కంటే భయంకరమైన వ్యాధులు ప్రభలే స్మశానాల్లో వృత్తి నిర్వహిస్తూ వస్తున్న కాటికాపరుల బతుకు భద్రతకు మరింత పట్టుదలతో ఉద్యమాన్ని నిర్వహించాలన్నారు. మార్చి 10 వరకు ఎక్కడికక్కడ ఎమ్మెల్యేలకు, స్థానిక ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇవ్వడంతో పాటు, అధికారులకు కూడా ఇవ్వాలన్నారు. మార్చి 11న విజయవాడలో జరిగే మహా ఆందోళనకు ప్రతి ఒక్కరూ నల్ల చొక్కా, తెల్ల పంచ, ఎర్ర కండువా పట్టుడు కర్రతో హాజరై కాటికాపరుల సత్తా ఏంటో చూపాలన్నారు. ఎపి డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి కరుణాకర్, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు డి. విజయమ్మ, మహిళా ప్రతినిధులు హుస్సేనమ్మ, జయమ్మ, ఎమ్మిగనూరు, కోసిగి, కల్లూరు, కృష్ణగిరి, కౌతాళం ఆదోని కోడుమూరు సి.బెళగల్ కర్నూలు వెల్దుర్తి మండలాల అధ్యక్ష కార్యదర్శులు తిమ్మన్న, రాజా, రమేష్, హనుమంతు ,దిలీప్, మదన గోపాల్ ,చక్రపాణి, బజారి, వీరేష్, బసవ యువరాజ్, ఈశ్వరయ్య, ప్రకాశం, నాగన్న ,మద్దిలేటి, నాగరాజు తదితరులు పాల్గొని మాట్లాడారు.



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ ఎండి ఆనంద్‌బాబు

ఉపాధి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉపాధి కూలీల పెండింగ్ వేతన బకాయిల బిల్లులను విడుదల చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ఓర్వకల్లు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించి ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బి.నాగన్న మాట్లాడుతూ ఎనిమిది వారాలైనా కూలీ డబ్బులు రాకపోతే ఏమి తిని పనులు చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వారంతట వారే పనులకు రాకుండా చేస్తున్నారని విమర్శించారు. ఒకపక్క ఉపాధి పనులను కల్పించాలని, కూలీలను పెంచాలని కలెక్టర్లు అధికారులను ఒత్తిడి పెడుతూ ఉన్నారని క్షేత్రస్థాయిలో కూలీ డబ్బులు రాక పనులకు రావటం లేదని అన్నారు. గతంలో మాదిరి 15 రోజులకు ఒకసారి కూలీ డబ్బులు ఇవ్వకుండా నెలల తరబడి పెండింగ్ పెట్టడంతో ఉపాధి కూలీలు ఇతర పనులను చేసుకుంటున్నారని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించి ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి పనిచేసిన 15 రోజులలోపు డబ్బులు ఇవ్వాలని అదేవిధంగా అనేక సంవత్సరాలుగా పనిముట్లు లేక ఇబ్బంది పడుతున్న కూలీలకు పారా, సలిక, ఇవ్వాలని పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలని కూలీలు వడదెబ్బ బారిన పడకుండా మజ్జిగ ఒఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి మేటిలు, కూలీలు మంజుల సువర్ణ గౌరీ కర్ణమ్మ కాంతమ్మ గిడ్డయ్య పాల్గొన్నారు.





నిరసనను ఉద్దేశించి మాట్లాడుతున్న విజయ రామాంజనేయులు

ఎపిజిబి ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎపిజిబి ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలని సిఐటియు ఓల్డ్ సిటీ నగర్ కార్యదర్శివిజయ రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్ద మార్కెట్ దగ్గర ఉన్న ఎపిజీబి వద్ద సిఐటియు ఓల్డ్ సిటీ నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిఐటియు నగర నాయకులు దూదకొండ కుమార్ అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో సిఐటియు ఓల్డ్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ దేశాయ్, విజయ రామాంజనేయులు మాట్లాడారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రదాన కార్యాలయం ఎక్కడ వుండాలి అని బావించినపుడు రాయలసీమ గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడప లోనే వుండాలని, దానికి సొంత భవనం కూడా ఉందన్నారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడప లోనే వుండాలని ఆరోజు నిర్ణయించారన్నారు. మార్గదర్శకాల ప్రాతిపదికన చూసినా కడపలోనే ఉండాలని నిబంధనలు తెలుపుతున్నాయన్నారు. ఈ తాండ్రపాడు సర్పంచి బాలపీర మాట్లాడుతూ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఇతర గ్రామీణ బ్యాంకులతో, జాతీయ బ్యాంకు లతో సై అంటే సై అని పోటీ పడి పని చెస్తుందన్నారు. ఇతర గ్రామీణ బ్యాంకు లతో పోల్చి నపుడు డెబిట్ కార్డు, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్ నెట్ బ్యాంకింగ్, వాట్సాప్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ అకౌంట్ తెరవడం క్యూఆర్ కోడ్స్, ఇలా అన్నింటిలోనూ మంచి ఫలితం సాధించిన బ్యాంకుగా, రాష్ట్రంలో గ్రామీణ బ్యాంకుల మొత్తం వ్యాపారం లొ 43శాతం వ్యాపారం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు కలిగి ఉందన్నారు. అందుకే అమరావతి కి తరలించ కుండా కడప లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు , కార్మికులు పాల్గొన్నారు.

పత్తికొండలో ధర్నా

ప్రజాశక్తి-పత్తికొండ

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించడాన్ని నిరసిస్తూ సిఐటియు పత్తికొండ మండల కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు నాయకులు దస్తగిరి అధ్యక్షతన శుక్రవారం పత్తికొండ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ముందు ధర్నా చేశారు. సిఐటియు పత్తికొండ మండల కార్యదర్శి డి గోపాల్ మాట్లాడుతూ 2006లో అనంత గ్రామీణ బ్యాంకు పినాకిని గ్రామీణ బ్యాంకు రాయలసీమ గ్రామీణ బ్యాంకులో విలీనమై ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు గా ఏర్పడి పనిచేస్తున్నదన్నారు. అన్నిటిలోనూ మంచి ఫలితాలను సాధించింది రాష్ట్రంలో గ్రామీణ బ్యాంకుల మొత్తం వ్యాపారంలో 43శాతం వ్యాపారం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ కలిగి ఉన్నదన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు రంగారెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి, హోసూరు రైతు సంఘం నాయకులు గంగన్న ,రాయలసీమ యూనివర్సిటీ కర్నూల్ మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు మధు చక్రాల రంగన్న, పుచ్చకాయల మాడ మోహన్, తదితరులు పాల్గొన్నారు.